క్లుప్తంగా

ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయండి



రాంపురంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సర్పంచ్ శిరీష

పెందుర్తి: ఎమ్మెల్యే, పెందుర్తి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తరపున రాంపురంలో ఆయన సతీమణి, సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష ప్రచారం చేశారు. గ్రామంలోని ఉపాధి హామీ కూలీలతో భేటీ అయ్యారు. వారికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా అదీప్‌రాజ్‌ను, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో దేవదాయశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న కరికల్ వలవెన్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని సోమవారం రాష్ట్ర దేవదాయశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కరికల్ వలవెన్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం అందజేశారు.

పైప్‌లైన్ పునరుద్ధరణ

యథావిధిగా తాగునీటి సరఫరా



పైప్‌లైన్ మరమ్మతులు చేపడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది

సబ్బవరం: మండలంలోని అమృతపురం సమీపంలో దెబ్బతిన్న సీపీడబ్ల్యూఎస్ పైప్‌లైన్ మరమ్మతులను ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది సోమవారం పూర్తి చేశారు.మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నుంచి సబ్బవరం సంపునకు వెళ్లే మెయిన్ పైప్‌లైన్ ఆదివారం ధ్వంసం కావడంతో మండలంలోని పలు గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయిన విషయం తెలిసిందే. దీంతో సోమవారం సిబ్బంది పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను యథావిధిగా పునరుద్ధరించారు.

డిమాండ్లు సాధించే వరకు పోరాటం

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు కార్మికుల డిమాండ్లను పూర్తిస్థాయిలో సాధించే వరకూ పోరాటం చేస్తామని గంగవరం పోర్టు ఎంప్లాయీస్ కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ మేరకు పోర్టు యాజమాన్య ప్రతినిధులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ముందుగా ఎంప్లాయీస్ కమిటీ ప్రతినిధులతో యాజమాన్య ప్రతినిధులు చర్చించారు. కార్మికుల తరపున కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ రూ.36వేలు జీతం ఇవ్వాలని కోరారు. స్పందించిన యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ యాజమాన్యంతో చర్చించిన అనంతరం చర్చలకు పిలుస్తామని చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అక్కిరెడ్డిపాలెం: గాజువాక గ్రీన్ హోటల్ ఎదురుగా గల గెడ్డలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గాజువాక ఎస్ఐ హరికృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక హిమాచల్ నగర్ గ్రీన్ హోటల్ వద్ద ఓ యాచకుడు నిత్యం యాచనతో జీవిస్తుండేవాడన్నారు. ఆదివారం సాయంత్రం వరకు గ్రీన్ హోటల్ ఎదురుగా ఒక బండి పక్కన కనిపించిన అతడు సోమవారం గెడ్డలో విగత జీవుడిగా కనిపించాడని తెలిపారు. శరీరం పూర్తిగా బక్కచిక్కి గెడ్డంతో ఉన్నాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించినట్లు తెలియజేశారు.

డెవలప్‌మెంట్ వాచ్

ప్రగతి పథం

- సింహగిరి పునరావాసుల లేఅవుట్ రూపురేఖలు
- రూ.1.30 కోట్లతో మౌలిక వసతుల కల్పన



నూతనంగా నిర్మించిన విశాలమైన సీసీరోడ్డు

సింహాచలం: పాతగోశాల సమీపంలోని సింహగిరి పునరావాసుల లేఅవుట్ రూపురేఖలు మారాయి. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపడంతో మౌలిక సదుపాయాలు సమకూరాయి.

ఇదీ పరిస్థితి

సింహగిరిపై ఉన్న నివాసితులతో పాటు గిరిజనులను కొండదిగువ పాత గోశాల వద్దకు 2008 లో తరలించారు.అయితే కాలనీలో మౌలిక వసతులు లేక 2009 నుంచి నిర్వాసితులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు, కాల్వలు నిర్మించాలని నివాసితులు పోరాటం చేశారు. టీడీపీ ప్రభుత్వంలో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించలేదు.

వుడా సహకారంతో లేఅవుట్ వేసి ప్రత్యామ్నాయంగా స్థలాలు కేటాయించారు. ఆ స్థలాల్లో నిర్వాసితులు ఇళ్లు నిర్మించుకున్నారు. గిరిజనులకు దేవస్థానం వ్యక్తిగత ఇళ్లు స్వయంగా కట్టించి ఇచ్చింది.

మారిన స్వరూపం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పునరావాసుల లేఅవుట్ రూపురేఖలు మారాయి. సుమారు రూ.1.30 కోట్ల నిధులతో కాలనీలో ఎనిమిది సీసీ రోడ్లు, 1000 మీటర్ల మేర డ్రైన్లు, 5 కల్వర్టులు నిర్మించారు. దీంతో సింహగిరి పునరావాసుల కష్టాలు తీరాయి. అలాగే లేఅవుట్‌లోని పాదాలమ్మ, బంగారమ్మ ఆలయాల ప్రహరీ నిర్మాణానికి దేవస్థానం రూ.10 లక్షలు మంజూరు చేసింది. గిరిజనుల కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి.



నూతనంగా నిర్మించిన కల్వర్టు



కాలనీకి వెళ్లే మార్గంలో వేసిన రోడ్డు



పాఠశాలకు వెళ్లే మార్గం ఇలా..



నూతనంగా నిర్మించిన సీసీ కాలువ

ఘనంగా సిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం



గణపతి హోమం, ప్రత్యేక పూజల్లో భక్తులు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెంలో ఏర్పాటు చేసిన సిద్ధి వినాయ ఆలయ వార్షికోత్సవాన్ని గ్రామ పెద్ద కూండ్రపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వేకువ జాము నుంచి గ్రామ పెద్దలు శ్రీనివాసరావు దంపతులు, అనేక మంది భక్తులు ఆలయంలో గణపతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనలో నాయుడుపాలెం పరిసర గ్రామాల ప్రజలు ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కూండ్రపు అప్పలనాయుడు, కూండ్రపు మధు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం

- ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయండి
- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



సాయినగర్ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: మీరు వేసే ఓటు 5 సంవత్సరాల మన భవిష్యత్తును నిర్ణయిస్తుందని ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలోని సాయినగర్ కాలనీలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి ఎన్నికల హామీ అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలన్నారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, అనకాపల్లి ఎంపీగా బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు.

చంద్రబాబువి అన్నీ మోసపూరిత మాటలే..

2014 ఎన్నికల్లో ఇచ్చిన 600 హామీలను అమలు చేయకుండా చంద్రబాబు ఏ విధంగా మోసం చేశారో గుర్తు చేసుకోవాలన్నారు. ఇప్పుడు మళ్లీ తప్పుడు హామీలతో వస్తున్న వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు.

జగన్‌తోనే సంక్షేమ పథకాల కొనసాగింపు

అమ్మ ఒడి,రైతు భరోసా,వైఎస్సార్ ఆసరా,వైఎస్సార్ చేయూత,వైఎస్సార్ పింఛన్ కానుక వంటి సంక్షేమ పథకాలను ప్రజల చెంతకే నేరుగా అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ప్రజలంతా దీవించాలన్నారు.వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయకుండా చంద్రబాబు,ఆయన తనయుడు లోకేష్‌లు వారి ప్రతినిధుల ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి నిలిపివేయడం వారి దిగుజారుడు తనానికి నిదర్శనమన్నారు. వారికి వృద్ధులు, అవ్వాతాతల ఉసురు తగులుతుందన్నారు.

స్టీల్ ప్లాంట్‌కు ద్రోహం

అనకాపల్లిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంపై అదీప్‌రాజ్ స్పందించారు. ఎందరో ప్రాణ త్యాగాల వల్ల ఏర్పడిన స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని కనీస ప్రకటన చేయని కూటమి అభ్యర్థులకు ఓటు వేస్తే ప్రైవేటీకరణకు మద్దతు ఇచ్చినట్టే అవుతుందన్నారు. రాష్ట్రంలో సచివాలయ,వలంటీర్ వ్యవస్థను ఆదర్శంగా తీసుకోవాలన్న నాయకులు చంద్రబాబు ట్రాప్‌లో పడి ఎన్నికలు ఉన్నాయని విమర్శలు చేయడం దారుణమన్నారు.

కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు,ఉప సర్పంచ్ మండల లక్ష్మణ,పార్టీ జిల్లా కార్యదర్శి దెడ్డం పద్మావతి,మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మోపాడ అప్పారావు,పార్టీ సీనియర్ నాయకులు పల్ల కృష్ణ,యర్రంశెట్టి రాము,యర్రా శ్రీనివాసరావు,మాజీ సర్పంచ్ దనిమిరెడ్డి శ్రీనివాసరావు,కొల్లి కృష్ణ,సత్యగంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి సింహాద్రి ట్యాక్సీస్టాండ్ డ్రైవర్లు



వైఎస్సార్‌సీపీలో చేరిన సింహాద్రి ట్యాక్సీస్టాండ్ యూనియన్ నాయకులతో ముత్తంశెట్టి

సింహాచలం: అడవివరంలోని సింహాద్రి ట్యాక్సీ స్టాండ్ నాయకులు, డ్రైవర్లు 50 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావును ఆయన నివాసంలో కలిసి మద్దతు తెలిపారు. తామంతా వైస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా వారికి ముత్తంశెట్టి కృతజ్ఞతలు తెలిపారు. సింహాచలం దేవస్థానంలో కారు స్టాండ్‌ప్రత్యేంగా ఏర్పాటు చేయాలని ముత్తంశెట్టిని వారు కోరారు. 98వవార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు లంక సత్తిబాబు ఆధ్వర్యంలో సింహాద్రి ట్యాక్సీ స్టాండ్ యూనియన్ ఉపాధ్యక్షుడు సిరిపురపు బంగార్రాజు, సభ్యులు బి.త్రినాథ్, కర్రోతు చంటి, దాసరి సోమరాజు, ఎర్ర వెంకటరావు, శిడగం కృష్ణ, బర్ల వరహానరసింహం,కడగల కృష్ణ తదితరులు కలిసినవారిలో ఉన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడండి

ఏవోలు, ఏపీవోలతో కలెక్టర్ మల్లికార్జున



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో పెందుర్తి ఆర్వో శేషశైలజ

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవోలు, ఏపీవోలు అప్రమత్తంగా ఉంటూ.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సమష్టి కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పిలుపునిచ్చారు. ఉత్తర, పెందుర్తి నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల్లో విధుల్లో భాగస్వామ్యమయ్యే పీవోలు, ఏపీవోలకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జరిగిన రెండో విడత శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్‌కు సంబంధించిన ప్రక్రియపై అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. అందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. ఇంకా ఏమైనా సందేహాలుంటే రెండో విడత శిక్షణలో వాటిని నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల అధికారులు సమయపాలన పాటించాలని, పోలింగ్ రోజున ఓపికతో ఓటర్లకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. పోలింగ్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఎస్‌బీసీ డీఐవో చంద్రశేఖర్, అసిస్టెంట్ డీఐవో పాషా, ఉత్తర, పెందుర్తి నియోజకవర్గాల ఆర్వోలు అఖిల, శేషశైలజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల పోరు.. ప్రచార హోరు



వంగలిలో తనకు ఓటు వేయాలని కోరుతున్న ఇండిపెండెంట్ అభ్యర్థి వెంకట నరసింహారావు



పెదముషిడివాడలో .

పరవాడ: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం ముమ్మరం చేశారు. పెందుర్తి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుకు మద్దతుగా సోమవారం బొద్దపువానిపాలెంలో మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు, పార్టీ నాయకులు కలసి బొద్దపువానిపాలెం, ఫార్మాసిటీ కాలనీ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఫ్యాను గుర్తుపై ఓటేసి అదీప్‌రాజ్, బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బొండా శ్రీను, సీహెచ్.రాజబాబు, కె.సురేష్, బొద్దపు అప్పారావు పాల్గొన్నారు.

- పెదముషిడివాడ శివారు గండివానిపాలెంలో పార్టీ నాయకుడు నందవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని కోరారు.
- సాలాపువానిపాలెంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సాలాపు సంతోష్ ఆధ్వర్యంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

సబ్బవరం: మండలంలోని వంగలిలో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీలను పెందుర్తి స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి గుంటూరు వెంకట నరసింహారావు సోమవారం కలిశారు.ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఉంగరం గుర్తుపై ఓటు వేయాలని కోరారు.

సింహాచలం: పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని అప్పన్నపాలెం, లక్ష్మీనగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పెందుర్తి అంసెంబ్లీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్ రాజ్‌ను, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు. ఇన్‌చార్జి సబ్బవరపు ముత్యాలనాయుడు, సచివాలయాల కన్వీనర్లు పీతల విష్ణుమూర్తి, కె.సింహాద్రి, కానూరి జగదీష్, సునీత, అప్పారావు, 98వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, పార్టీ నాయకులు నడింపల్లి రామరాజు, 94వవార్డు నాయకుడు అడ్డాల రామరాజు పాల్గొన్నారు.



సాలాపువానిపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

- 93వవార్డులోని సింహాద్రినగర్‌లో సోమవారం వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి దాసరి అన్నపూర్ణ ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో దాసరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



బొద్దపువానిపాలెంలో ప్రచారం చేస్తున్న చిన్నారావు



అప్పన్నపాలెంలో నిర్వహిస్తున్న సబ్బవరపు ముత్యాలనాయుడు, నాయకులు

చూడ ముచ్చటగా..



సుందరంగా సుజాతనగర్ ఎ-జోన్ పార్కు

పెందుర్తి: ప్రజలకు ఆహ్లాదం..ఆనందంతో పాటు ఆరోగ్యం పంచే పార్కుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. జీవీఎంసీ విలీన ప్రాంతాల్లో పార్కుల అభివృద్ధికి పెద్దపీట వేసింది. ఏళ్ల తరబడి పిచ్చిమొక్కలు..అధ్వానంగా ఉన్న పార్కులకు చికిత్స చేసింది. భారీ స్థాయిలో నిధులు కేటాయించి అత్యాధునికంగా తీర్చిదిద్దింది. కేవలం పిల్లలు ఆడుకోవడం, పెద్దలు సేదతీరడానికే కాకుండా అన్ని వయసుల వారికి అవసరమైన సామగ్రి, వ్యాయామ పరికరాలు సమకూర్చింది. స్పోర్ట్స్, థీమ్, జిమ్‌లను సమకూర్చింది. ఆహ్లాదం పంచేలా పచ్చని మొక్కలు నాటి నందన వనాలుగా తీర్చిదిద్దారు. అధునాతన వాకింగ్ ట్రాక్‌లు, షటిల్ కోర్టులు ఏర్పాటు చేయడంతో చిన్నా పెద్దా అని తేడా లేకుండా అంతా పార్కుల్లో ఆనందంగా గడుపుతున్నారు.



అద్భుతంగా తీర్చిదిద్దిన చినముషిడివాడ సత్యానగర్ పార్కు

కేంద్రం దిగొచ్చేవరకు 'ఉక్కు' ఉద్యమం

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కుపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి తగదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం దిగొచ్చి, స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామని ప్రకటించేవరకు దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఉక్కు ఉద్యోగుల వేతనాల జాప్యంపై నిరసన



స్టీల్‌ప్లాంట్ సీజీఎం సోబ్తీతో చర్చిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు ఈడీ వర్క్స్ (బిల్డింగ్) వద్ద ధర్నా చేశారు. ధర్నాలో యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ ప్లాంట్ కోసం కష్టించి పనిచేస్తున్న ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. సకాలంలో జీతాలు అందక ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వేతనాలు చెల్లించలేని అసమర్థ యాజమాన్యం ప్రస్తుతం ప్లాంట్‌లో ఉందన్నారు. అనంతరం సీజీఎం (వర్క్స్) సోబ్తీని కలిసి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో కొవిరి అవతారం, వేణువర్మ, రమణమూర్తి, నాయుడు, కొమ్ము ప్రసాద్, దేముడు, మంత్రి నారాయణ, గంగవరం గోపీ తదితరులు పాల్గొన్నారు.